
ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 56 మంగళవారం 28, అక్టోబర్ 2025 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




# రంగంలోకి రేవంత్..

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారానికి సిద్ధమైన సీఎం రేవంత్
రెండు విడతలుగా సాగనున్న ముఖ్యమంత్రి ప్రచారం
మతం పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందన్న మహేశ్‌గౌడ్
ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన టీపీసీసీ చీఫ్
తాము వ్యక్తిగత విమర్శలు చేయబోమని స్పష్టీకరణ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచార రంగంలోకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా దిగనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ఆయన విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఇందులో భాగంగా ఒక భారీ బహిరంగ సభ, పలు రోడ్‌షోల లో ఆయన పాల్గొంటారు. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం రేపు జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. 30, 31 తేదీల్లో తొలి విడత రోడ్‌షోలు ఉంటాయి. మళ్లీ నవంబర్ 4, 5 తేదీల్లో రెండో విడత రోడ్‌షోలలో సీఎం పాల్గొని ప్రచారం నిర్వహిస్తారు. ఈ ప్రచార కార్యక్రమాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం మిగతా 2లో..



# ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

## వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

వీధి కుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
ఆదేశాలు పాటించని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు సమన్లు
పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలకు మినహాయింపు
నవంబర్ 3న కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం
దేశ ప్రతిష్ట దెబ్బతింటోందని ధర్మాసనం కీలక వ్యాఖ్య
హాజరు కాకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది. వారంతా నవంబర్ 3న తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని సోమవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, మిగతా 2లో..

# జూబ్లీహిల్స్‌లో పోటీ మజ్లిస్- భాజపా మధ్యే

జూబ్లీహిల్స్‌లో అసలు పోటీ బీజేపీ, ఎంఐఎం మధ్యేనన్న రాంచందర్ రావు
కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్న రాష్ట్ర బీజేపీ చీఫ్
ఈ ఉప ఎన్నిక 2028 ఎన్నికలకు నాంది పలకాలని వ్యాఖ్య



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సమీపిస్తున్న వేళ బీజేపీ ప్రచారంలో దూకుడు పెంచింది. ఈ ఎన్నికలో అసలు పోటీ తమకు, ఎంఐఎం పార్టీకి మధ్యేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు బీజేపీకి ఓటు వేయకపోతే, మజ్లిస్ సీట్ల సంఖ్య 8కి పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.
హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు అధ్యక్షతన ఉపఎన్నికపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు చర్చించారు. ప్రచారంలో నగరంలోని కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులను విస్తృతంగా మిగతా 2లో..

# మీ అల్లుడిని కంట్రోల్‌లో పెట్టుకోండి

కేసీఆర్‌కు మంత్రి లక్ష్మణ్ సూచన
హరీశ్ రావుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర విమర్శలు
కాంగ్రెస్ కేబినెట్‌ను 'దండుపాళ్యం బ్యాచ్' అనడంపై ఆగ్రహం
వెంటనే హరీశ్ రావు క్షమాపణ చెప్పాలని డిమాండ్



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హరీశ్ రావు నోటికి వచ్చినట్లు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ మంత్రివర్గాన్ని 'దండుపాళ్యం బ్యాచ్' అంటున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మిగతా 2లో..

# జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ టూ తెలంగాణ భవన్.. ఆటోలో ప్రయాణించిన కేటీఆర్..!

నాడు రాహుల్ గాంధీ ప్రయాణించిన ఆటోలో ప్రయాణం చేసిన కేటీఆర్!
మస్రత్ అలీ అనే వ్యక్తి ఆటోలో తెలంగాణ భవన్ వచ్చిన కేటీఆర్
అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ఈయన ఆటోనే ఎక్కారని గుర్తు చేసిన కేటీఆర్
ఆటో డ్రైవర్లకు ఎన్నో హామీలు ఇచ్చి నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శ



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆటోలో ప్రయాణించారు. తెలంగాణలోని ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా

# హైడ్రా ప్రజావాణికి కబ్జా ఫిర్యాదుల వెల్లువ..

## సాక్ష్యాలతో తరలివస్తున్న జనం




**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

హైదరాబాద్‌లో భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలపై నగరవాసులు నేరుగా రంగంలోకి దిగుతున్నారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలకు హైడ్రా ప్రజావాణిలో తక్షణ పరిష్కారం లభిస్తుండటంతో, బాధితులు సాక్ష్యాలతో సహా కార్యాలయానికి క్యూ కడుతున్నారు. సోమవారం ఒక్కరోజే

హైడ్రా ప్రజావాణికి పోటెత్తిన భూకబ్జా ఫిర్యాదులు
ఒక్కరోజే 52 ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు
ఫొటోలు, వీడియోలతో సాక్ష్యాలు అందిస్తున్న నగరవాసులు
చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఎక్కువగా ఫిర్యాదులు
హస్మత్‌పేటలో 28 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాపై ఆరోపణలు
ఫిర్యాదులను నేరుగా పర్యవేక్షిస్తున్న కమిషనర్ రంగనాథ్

# హైదరాబాద్ శివార్లలో 100 ఎకరాల్లో భారీ గోశాల..

రంగారెడ్డి జిల్లా ఎన్కేపల్లిలో స్థలం కేటాయింపు
భూమిని నమ్ముకున్న 40 కుటుంబాలకు పునరావాసం, ఉద్యోగ హామీ
భూమిని స్వాధీనం చేసుకున్న హెచ్ఎండీఏ.. టెండర్ల ప్రక్రియ ప్రారంభం
నగరంలోని నిరాశ్రయ గోవులకు ఆశ్రయం కల్పించడమే లక్ష్యం







## మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తాం.
జూబ్లీహిల్స్ లో ఓడిస్తేనే కాంగ్రెస్ కు బుద్ధి
మాజీ మంత్రి హరీష్ రావు

## మీ అల్లుడిని కంట్రోల్‌లో పెట్టుకోండి

**మొదటిపేజీ తరువాయి**



మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యాఖ్యలపై హరీశ్ రావు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
బలహీన వర్గాలకు చెందిన మంత్రులున్న కేబినెట్‌ను ఉద్దేశించి ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని అడ్లూరి లక్ష్మణ్ ప్రశ్నించారు. "మా మంత్రివర్గం దండుపాళ్యం బ్యాచ్ అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని మంత్రివర్గం స్టువర్ట్‌పురం దొంగల ముఠా లాంటిదా?" అని ఆయన నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల మంత్రులపై చేసిన ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, హరీశ్ రావు వెంటనే తన మాటలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ మరికొన్ని సంచలన ఆరోపణలు చేశారు. "కేసీఆర్‌కు తెలియకుండానే గతంలో హరీశ్ రావు 28 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సొంతంగా ఫండింగ్ చేశారు. ఈ విషయం తెలియడం వల్లే రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా కేసీఆర్ వెంటనే ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేదు" అని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్ రావు అవినీతికి పాల్పడ్డారని గతంలో కవిత చేసిన ఆరోపణలను గుర్తు చేస్తూ, దీనిపై చర్చకు రమ్మంటే ఆయన తోక ముడిచారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను చర్చకు పంపుతానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాము అంబేద్కర్ విగ్రహం వద్ద చర్చకు రావడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. చివరగా, "కేసీఆర్ గారూ.. దయచేసి మీ అల్లుడిని కంట్రోల్‌లో పెట్టుకోండి" అని అడ్లూరి లక్ష్మణ్ హితవు పలికారు.

## ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

**మొదటిపేజీ తరువాయి**

జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్, 2023 అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ ఏడాది ఆగస్టులోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, చాలా రాష్ట్రాలు పట్టించుకోకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "అధికారులు వార్తాపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియా చూడటం లేదా? ఆదేశాలు అందకపోయినా, అఫిడవిట్లు ఇక్కడ ఉండాల్సింది. నవంబర్ 3న చీఫ్ సెక్రటరీలందరూ తప్పనిసరిగా కోర్టులో హాజరు కావాలి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది.
పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని కోర్టు గుర్తించింది. "దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విదేశాల దృష్టిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మేం కూడా వార్తా కథనాలను చదువుతున్నాం" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది.
ఇదే సమయంలో, ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు (RWA), వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. "దేశంలోని RWA లన్నీ ఈ కేసులో పార్టీలుగా చేరతామంటే, మన ముందు కోట్లాది మంది ఉంటారు కదా? సహేతుకమైన సూచనలు చేయండి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.
తదుపరి విచారణ తేదీన చీఫ్ సెక్రటరీలు హాజరు కాకపోతే, కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని సుప్రీంకోర్టు



హెచ్చరించింది. ఢిల్లీ విషయంలో ఎంసీడీ ఇచ్చిన నివేదిక సరిపోదని, అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలతో పాటు, వాటి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ల వివరాలతో అన్ని రాష్ట్రాలు నివేదికలు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 3న జరగనుంది.

## హైడ్రా ప్రజావాణికి కబ్జా ఫిర్యాదుల వెల్లువ..

**మొదటిపేజీ తరువాయి**

ప్రజావాణికి ఏకంగా 52 ఫిర్యాదులు అందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేరుగా పర్యవేక్షిస్తున్న ఈ కార్యక్రమానికి వస్తున్న ప్రజలు, తమ సమస్యలను ఫొటోలు, వీడియోల రూపంలో అధికారుల ముందుంచుతున్నారు. రోడ్లను ఆక్రమిస్తే ఫొటోలు, చెరువులను కబ్జా చేస్తుంటే వీడియోలతో సహా వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. కొందరు బాహాటంగా తమ వివరాలు వెల్లడిస్తుంటే, మరికొందరు తమ పేర్లను గోప్యంగా ఉంచాలని కోరుతున్నారు. గంటల్లో, రోజుల్లోనే తమ సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్న నమ్మకంతోనే వస్తున్నామని పలువురు చెబుతున్నారు.

**ప్రభుత్వ భూములు, చెరువులే లక్ష్యం**

ప్రజావాణికి అందిన ఫిర్యాదుల్లో ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా, బాలానగర్ మండలం హస్మత్‌పేట్‌లోని సర్వే నంబర్ 1లో ఉన్న 28.28 ఎకరాల చారిత్రక ప్రభుత్వ భూమిని స్థానిక రాజకీయ నాయకులు, వారి అనుచరులు ఆక్రమించి ప్లాట్లుగా అమ్ముతున్నారని ఓల్డ్ బోయిన్‌పల్లి వాసులు ఫిర్యాదు చేశారు.
అదేవిధంగా, శంషాబాద్ పరిధిలోని నరసింహ కుంట తూములు మూసేయడంతో పంట పొలాలు, ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్లు మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని 22 ఎకరాల శాంబుని కుంట ఆక్రమణలతో ఆరేడు ఎకరాలకు పరిమితమైందని, కూకట్‌పల్లిలోని పరికి చెరువులో 12 ఎకరాలను రాత్రికి రాత్రే మట్టితో పూడ్చేస్తున్నారని స్థానికులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. సాగర్ రోడ్డులో కాలనీ రోడ్లను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చారని, అమీన్‌పూర్ పెద్ద చెరువు కబ్జాను అడ్డుకున్న వారిపై దాడులు చేస్తూ పోలీసులతో తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని పలువురు వాపోయారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా పరిశీలించారు. సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత అధికారులకు వాటిని అప్పగించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.



## జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ టూ తెలంగాణ భవన్..

**మొదటిపేజీ తరువాయి**

తెలుసుకోవడానికి, వారికి మద్దతుగా మస్రత్ అలీ అనే వ్యక్తి ఆటోలో కేటీఆర్ తెలంగాణ భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని ఆరు లక్షలకు పైగా ఆటో డ్రైవర్ల పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని అన్నారు.
గతంలో మస్రత్ అలీ ఆటోలోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రయాణించారని ఆయన గుర్తు చేశారు. నాడు ఇదే ఆటోలో ప్రయాణించిన రాహుల్ గాంధీ, ఆటో డ్రైవర్లకు ఎన్నో హామీలు ఇచ్చారని విమర్శించారు. నిన్న రాహుల్, నేడు నేను ప్రయాణించిన ఈ మస్రత్ అలీ తనకున్న రెండు ఆటోలను అమ్మి ప్రస్తుతం కిరాయి ఆటో నడుపుతున్నాడని ఆయన తెలిపారు.
ఆత్మహత్య చేసుకున్న 161 మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటోలో ప్రయాణించిన సమయంలో మస్రత్ అలీతో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్ ఆటోలో ఉన్న సమయంలో పలువురు సెల్ఫీ దిగేందుకు ఆసక్తి కనబరిచారు.



## రంగంలోకి రేవంత్..

**మొదటిపేజీ తరువాయి**






రెండు విడతలుగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్‌లో 70 శాతం సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని తెలిపారు. బీజేపీ కేవలం మతం పేరుతో ఓట్లు అడగడంపైనే దృష్టి పెట్టిందని, హైదరాబాద్ అభివృద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. ముఖ్యంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నగరాభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని ఆరోపించారు.
జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా గెలుస్తుందని మహేశ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఏఐసీసీ పెద్దలు అందరినీ గమనిస్తున్నారని, అధిష్ఠానం దృష్టిలో అందరూ సమానమేనని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్ లాగా తాము ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూడమని స్పష్టం చేశారు. మాగంటి గోపీనాథ్ కుటుంబ వ్యవహారం వారి వ్యక్తిగతమని, దానితో తమకు సంబంధం లేదని తేల్చి చెప్పారు.

## హైదరాబాద్ శివార్లలో 100 ఎకరాల్లో భారీ గోశాల..

- **రంగారెడ్డి జిల్లా ఎన్కేపల్లిలో స్థలం కేటాయింపు**
- **భూమిని నమ్ముకున్న 40 కుటుంబాలకు పునరావాసం, ఉద్యోగ హామీ**
- **భూమిని స్వాధీనం చేసుకున్న హెచ్‌ఎండీఏ.. టెండర్ల ప్రక్రియ ప్రారంభం**
- **నగరంలోని నిరాశ్రయ గోవులకు ఆశ్రయం కల్పించడమే లక్ష్యం**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద, అత్యంత ఆధునిక గోశాల నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. హైదరాబాద్ నగరంలో నిరాదరణకు గురవుతున్న గోవులకు సురక్షిత ఆశ్రయం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రామంలో 100 ఎకరాల సువిశాల ప్రభుత్వ భూమిలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. ఈ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇటీవల రూ. 157 కోట్లతో పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయడంతో పనులు వేగవంతమయ్యాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (HMDA) ఆధ్వర్యంలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (HGCL) ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు గోశాల నిర్మాణానికి కేటాయించిన భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేసి, హద్దులు నిర్ణయించి హెచ్‌ఎండీఏకు అధికారికంగా అప్పగించారు. ప్రస్తుతం అధికారులు ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే నిర్మాణ పనులు మొదలు కానున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఒక ముఖ్యమైన మానవతా దృక్పథాన్ని హెచ్‌ఎండీఏ ప్రదర్శించింది. గోశాలకు కేటాయించిన ప్రభుత్వ భూమిని గత కొన్నేళ్లుగా సుమారు




40 నిరుపేద కుటుంబాలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. గోశాల నిర్మాణం వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన హెచ్‌ఎండీఏ అధికారులు వారితో చర్చలు జరిపి, ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపారు.
ప్రతి కుటుంబానికి అదే ప్రాంతంలో 300 గజాల నివాస స్థలం కేటాయించడంతో పాటు కుటుంబంలో ఒకరికి గోశాలలోనే ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల సానుకూల స్పందనతో సంతృప్తి చెందిన ఆ కుటుంబాలు భూమిని అప్పగించేందుకు అంగీకరించాయి. ఈ మెగా గోశాల నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ నగరంలో వేలాది గోవులకు సురక్షితమైన ఆశ్రయం లభించనుందని అధికారులు తెలిపారు.

## మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- **కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తాం.**
- **జూబ్లీహిల్స్ లో ఓడిస్తేనే కాంగ్రెస్ కు బుద్ధి**
- **మాజీ మంత్రి హరీష్ రావు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై కాంగ్రెస్ పై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ లో సోమవారం రజక సంఘం సమావేశం నిర్వహించారు. రెండేళ్ల రేవంత్ రెడ్డి పాలన చూసిన తర్వాత బూతులు తప్ప ఏం లేవని ప్రజలు భావిస్తున్నారన్నారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీల గ్యారెంటీ కార్డు ఇచ్చి బాండ్ పేపర్ మీద రాసి 100 రోజుల్లో అమలు చేస్తామన్నారన్నారు. అక్కచెల్లెళ్లకు మహాలక్ష్మి వచ్చిందా? ప్రతి మహిళకు నెలకు 2500 ఇస్తామన్నారు ఇచ్చారా? ప్రతి అక్కకు చెల్లెకు రేవంత్ రెడ్డి 60 వేల రూపాయలు బాకీ పడ్డాడన్నారు. ఓట్ల కోసం ఒకనాడు ఇచ్చే పైసలు కాదు.. నువ్వు బాకీ పడ్డ అరవై వేల రూపాయలు అక్కాచెల్లెళ్ళకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిల్లలకు ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులకు మోసం.. నిరుద్యోగులను రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేశారన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో కేసీఆర్ కిట్టు బందు.. పైసల్ బంద్ అని, ఉన్న పథకాలకు కత్తెర పెట్టిండు రేవంత్ రెడ్డి అని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి ఒక్క ఇల్లు అయినా పేదలకు ఇచ్చాడా? అని నిలదీశారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీని ఓడగొడితే మొత్తం తెలంగాణకు లాభం జరుగుతుందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు అవుతాయన్నారు. చపాతి మేకర్, రోడ్ రోలర్ గుర్తులు పెట్టించి ఓట్లు చీల్చే ప్రయత్నం చేస్తుంది కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. రేవంత్ రెడ్డిది దింపుడు కళ్లెం ఆశ అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలు ఇది అందరి భవిష్యత్తు, జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ గెలిస్తే ప్రభుత్వం రాదు.. కానీ రేవంత్ రెడ్డికి అర్థం కావాలి ప్రజలను మోసం చేశానని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రజకుల గౌరవాన్ని నిలబెట్టే బాధ్యత బీఆర్ఎస్ పార్టీది.. కేసీఆర్ ది అని స్పష్టం చేశారు.
అనంతరం ముథోల్ నియోజకవర్గ బీజేపీ నేత సిందే దీక్షిత్ ఆయన అనుచరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గులాబీ కండువా కప్పి పార్టీలోకి మాజీమంత్రి హరీష్ రావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి క్యాబినెట్ కచ్చితంగా. దండుపాళ్యం ముఠాఅని దుయ్యబట్టారు. మంత్రుల పంచాయతీల పరిష్కారం కోసమే క్యాబినెట్ సమావేశాలు పెట్టుకుంటున్నారా? అని నిలదీశారు. దక్కన్ యాజమాన్యాన్ని తుపాకీతో బెదిరించిన వ్యవహారంలో నిగ్గు తేల్చేందుకు సీబీఐ విచారణకు సిద్ధమా? దమ్ముంటే జ్యుడీషియల్ విచారణ జరపండి అని సవాల్ చేశారు. రెండేళ్లలో రేవంత్ రెడ్డి ఒక్క భవనం కట్టలేదు కానీ కటింగ్ మాస్టర్ గా మారారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆటోనగర్, ఆటో సంక్షేమ బోర్డు, ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, ప్రమాద బీమా 10 లక్షల పెంచుతామని ఇచ్చిన హామీ పత్తా లేకుండా పోయిందన్నారు. ఇస్తామన్న 12 వేల రూపాయలకి దిక్కు లేదన్నారు. లక్ష కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తున్నాం.. లక్ష కోట్లతో ఫోర్త్ సిటీ నిర్మిస్తానంటున్నావు కానీ ఆటో డ్రైవర్లకు నెలకు వేయి రూపాయలు ఇవ్వలేవా రేవంత్ రెడ్డి? అని నిలదీశారు. ఆటోకార్మికులకు బాకీ పడ్డ 24 వేల రూపాయలు ప్రతి ఆటో డ్రైవర్ కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 3 లక్షలు ఫీజు పెంచితే మద్యం టెండర్లపై 3 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చాయని, అందులో నుంచి 1500 కోట్లు ఆటో కార్మికులకు ఇచ్చి ఆటో కార్మికులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 161 ఆటో కార్మికులు చనిపోయారని, ఆ కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయని, చనిపోయిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ఒక్కొక్కరికి 10లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని, ఆటో కార్మికులు ఎవరూ చనిపోవద్దని విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ఓడిపోతే కనీసం రేవంత్ రెడ్డికి బుద్ధి వస్తుంది. ఆటో కార్మికులకు ఇస్తానన్న హామీలు నెరవేరుస్తాడన్నారు. కేసీఆర్ మళ్ళీ వస్తారు.. ఆటో డ్రైవర్ ల కష్టాలు తీరుస్తారని భరోసా ఇచ్చారు.



## జూబ్లీహిల్స్‌లో పోటీ మజ్లిస్ భాజపా మధ్యే

**మొదటిపేజీ తరువాయి**

భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు.
ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. "జూబ్లీహిల్స్‌లో ఎంఐఎంను ఆపాలంటే బీజేపీని గెలిపించాలి. ప్రజల్లో కూడా బీజేపీని గెలిపించాలనే ఆలోచన బలంగా ఉంది" అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. 2028లో జరిగే సాధారణ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నాంది పలకాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.
మరోవైపు, నామినేషన్ల పర్వం ముగియడంతో అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కూడా నియోజకవర్గంలో హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ కూడా ప్రచారాన్ని ముమ్మరం చేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపడతారు.



# మద్యం దుకాణాలకు లక్కీ డ్రా

- కలెక్టర్ నేతృత్వంలో కొనసాగిన ప్రక్రియ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా కొనసాగిన లక్కీ డ్రా
- భారీ పోలీసు బందోబస్తు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, అక్టోబర్ 27 (ప్రజా స్వరం) :** మద్యం దుకాణాల లైసెన్సుల జారీ కోసం సోమవారం మెదక్ బోధన్ రోడ్ లోని వెంకటేశ్వర గార్డెన్ లో లాటరీ పద్ధతిలో వైన్ షాపు ల కేటాయింపునకు లక్కీ డ్రా నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ నేతృత్వంలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా సాఫీగా ఈ ప్రక్రియ కొనసాగింది. నూతన ఎక్సయిజ్ పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా పక్కాగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 49 మద్యం షాపులకు గాను మొత్తం 1420 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఒక్కో షాపు వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన వారిని ఆహ్వానిస్తూ, వారి సమక్షంలో కలెక్టర్ రాహుల్ రాజ్ లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేశారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా డ్రా నిర్వహించారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా లక్కీ డ్రా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ జరిపించారు. పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు హాజరు కావడంతో టోకెన్ కలిగి ఉన్న వారినే లోనికి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వెంకటేశ్వర గార్డెన్ తో పాటు పరిసర ప్రాంతాల్లోనూ కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ మహేందర్, డి.ఎస్.పి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును పర్యవేక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. లక్కీ డ్రా లో అదృష్టం వరించి వైన్ షాపులు కేటాయించబడిన వారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన ఏర్పాట్లు కల్పించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి ఇతర అధికారుల పర్యవేక్షణలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీ డ్రా ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా లాటరీ ప్రక్రియ కొనసాగించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మీడియాతో మాట్లాడుతూ మెదక్ జిల్లాలో మొత్తం 49 మద్యం షాపులు ఉన్నాయని మెదక్ వెంకటేశ్వర గార్డెన్ లో అత్యంత పారదర్శకంగా ఫోటోగ్రఫీ వీడియోగ్రఫీ ద్వారా లక్కీ డ్రా తీయడం జరిగిందన్నారు. ఇందులో రిజర్వేషన్ ప్రాతిపదికలో భాగంగా గాను ఎస్టి 01, ఎస్సీ06, గౌడ కులానికి సంబంధించి09 మొత్తం 16 షాపులు కేటాయించామన్నారు. మిగతా 33 షాపులు అన్ రిజర్వ్ కింద కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో 18 షాపులకు మహిళలు లాటరీ గెలుచుకోగా, 31 షాపులకు పురుషులు దక్కించుకోవడం జరిగిందన్నారు. మద్యం టెండర్లు దక్కించుకున్న వారు డిసెంబర్ 01 తేదీ నుంచి మద్యం షాపులు కేటాయించడం జరుగుతుందన్నారు.











## ఆ లెక్చరర్ మాకు వద్దు మహాప్రభో

- విద్యార్థుల జీవితాలతో ఆడుతున్న లెక్చరర్
- వివాదాలకు కేర్ ఆఫ్‌గా అతను
- ఎంత చెప్పిన మారని తీరు

**మెదక్ అక్టోబర్ 27 (ప్రజా స్వరం) :** విద్యార్థులకు పాఠాలు బోధించకుండా విద్యార్థిని విద్యార్థులతో టైం పాస్ చేస్తూ కాలం జరుపుతున్నారని ఓ సబ్జెక్టు లెక్చరర్ పైన మెదక్ జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ కు పిర్యాదు చేయడం జరిగింది. ఆ లెక్చరర్ రూటే వేరు అనే విధంగా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్ గా పనిచేస్తున్న బాటని డిపార్ట్మెంట్ కు చెందిన రాజు అనే లెక్చరర్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు అసలు పాఠాలు చెప్పకుండా అక్కడే వారి జీవితాలతో ఆడుతున్నాడు. తను పాఠాలు చేయకుండా క్లాస్ లో అటు ఇటు తిరిగి వాళ్ళని చదువుకోమని చెప్పి టైం పాస్ చేస్తూ కాలము గడుపుతున్నాడని అక్కడి విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గతంలోని ఈ లెక్చరర్ పై వివిధ విద్యార్థి సంఘాలు ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకుని వెళ్లిన తరుణంలో ప్రిన్సిపల్ పలుమార్లు హెచ్చరించిన అతని ప్రవర్తన మారుకోలేదు. అంతే కాకుండా అతని పిహెచ్డి పట్టా పై కూడా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయనీ, గతంలో కొందరు విద్యార్థిని విద్యార్థులతో సైతం ఆసభ్యకరంగా ప్రవర్తించడంతో వారి తల్లిదండ్రులు వచ్చి ప్రిన్సిపాల్ కి, డిపార్ట్మెంట్ హెచ్ఓడి కి చెప్పడంతో పలు మార్లు మందలించడం జరిగింది. అయినా ఏ మాత్రం మార్పు చెప్పకుండా ఇంకా రోజు రోజుకు కళాశాలకు విద్యార్థిని విద్యార్థులకు మరిన్ని ఇబ్బందులు పెడుతున్నారని కొందరు అధ్యాపకులు గుసగుసలాడుతుంటున్నారు. కళాశాలలో ఎంత మంది లెక్చరర్లు తన ప్రవర్తన మార్చుకోమని చెప్పిన ఎవర్ని లెక్కచేయకుండా వారంలో సెమిస్టర్ పరీక్షలు దగ్గర పడడంతో విద్యార్థులు ఎలా పాస్ అయితామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ లెక్చరర్ పైన చర్యలు తీసుకోవాలని వివిధ విద్యార్థి సంఘ నాయకులు సైతం అలెక్చరర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

## మద్యం దుకాణాల కేటాయింపు

**వికారాబాద్, అక్టోబర్ 27(ప్రజా స్వరం) :** జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తి అయ్యింది. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో జిల్లాలోని 59 మద్యం షాపులకు లాటరీ ద్వారా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియ సజావుగా జరిగింది. జిల్లాలోని 59 మద్యం షాపులకు గాను 1808 మంది టెండర్లు వేయడం జరిగింది. ఇందులో వికారాబాద్ సర్కిల్ లో 12, తాండూర్ 18, పరిగి 15, కొడంగల్ 8, మోమిన్పేట్ 6 మద్యం షాపులకు టెండర్లు తీసుకోవడం జరిగింది. మద్యం షాపుల కేటాయింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే.విజయభాస్కర్, అబ్కారీ, పోలీస్ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



- అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

**వికారాబాద్, అక్టోబర్ 27(ప్రజా స్వరం):** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 106 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ సుధీర్ తో పాటు డి ఆర్ ఓ మంగీ లాల్, లకు విన్నవిస్తూ ఫిర్యాదు లు సమర్పించారు. అట్టి ఫిర్యాదులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. భూ సమస్య లు , ఇతర సమస్యలపై సంబంధించి పిర్యాదు లు వచ్చాయన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవో వాసు చంద్ర , తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు

**వికారాబాద్, అక్టోబర్ 27(ప్రజా స్వరం ):** జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తరణ లక్ష్యాలను సాధించి, రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐ.డి.ఓ.సి కాన్ఫరెన్స్ హాల్ నందు ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో అయిల్ ఫామ్ సాగు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల ఆదాయం పెరిగేలా ప్రతి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ తోటల పెంపక విస్తీర్ణం పెంచడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లాలో 2500 ఎకరాలలో పంట సాగు లక్ష్యంగా ఉందని, సాగు కోసం రైతులను గుర్తించి అవగాహన కల్పించాలని, సబ్సిడీలు, అంతర పంటల ఆదాయం, డ్రిప్ రాయితీలు తదితర వివరాలను రైతులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. విజయవంతమైన రైతులను రోల్ మోడల్‌గా చూపించి, బ్యాంకులు, ఉపాధి హామీ పథకం ద్వారా సహకారం అందించాలని తెలిపారు. జిల్లాలో అయిల్ ఫామ్ పంటల సాగు ద్వారా రైతులకు లబ్ధి చేకూరేలా అమలు చేయాలన్నారు. పండ్ల తోటలు, కూరగాయలు, ఆధునిక సాగు పద్ధతులు, కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్లు తదితర వంటి సదుపాయాలను సమర్థవంతంగా అందించాలన్నారు. తెలంగాణ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులకై రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులపై ప్రభుత్వం రాయితీలు అందిస్తోందని తెలిపారు. వర్గాల వారీగా రాయితీలు అందుబాటులో ఉండటంతో, రైతులు సాగు ఖర్చు తగ్గించుకుని ఆదాయం పెంచుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి నెలకు ఒకరోజు రైతు వేదికలో మండల స్థాయి అధికారులు సంబంధిత శాఖలతో రైతుల సమావేశాలు నిర్వహించి, పథకాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, రైతులకు లబ్ధి చేకూరేలా గ్రామ స్థాయిలో కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఉద్యాన వన శాఖ అధికారి అయిల్ ఫామ్ పంటల సాగు పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

# తాండూర్ మాత శిశు ఆసుపత్రిలో బాలింత మృతి

- వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే అంటూ బంధువుల ఆందోళన

**తాండూరు, అక్టోబర్ 27(ప్రజా స్వరం):**





వికారాబాద్ జిల్లా తాండూరు ప్రభుత్వ మాత శిశు ఆసుపత్రిలో సోమవారం ఉదయం విషాద సంఘటన చోటుచేసుకుంది. వికారాబాద్ జిల్లా కోటపల్లి మండలం ఎన్నారం గ్రామానికి చెందిన రజిత అనే బాలింత రెండవ కాన్పు కోసం మాత శిశు ఆసుపత్రిలో ఫిరగా వైద్య సిబ్బంది సిజేరియన్ శస్త్ర చికిత్స అనంతరం మరణించింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రజితకు వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. అయితే ఉదయం తెల్లవారుజామున (ఫిట్స్) రావడంతో ఆమె పరిస్థితి విషమించిందని, చివరకు మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఈ సంఘటనతో కుటుంబ సభ్యులు ఆవేదనకు గురై ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గత 15 రోజుల వ్యవధిలోనే ఈ ఆసుపత్రిలో ఇద్దరు గర్భిణీలు వైద్య చికిత్సలో లోపం వల్ల మృతి చెందడం గమనార్హం.

**బాలింత మృతి పట్ల సమగ్ర విచారణ జరపాలి**

తాండూరు పట్టణంలో మాతా శిశు ఆసుపత్రిలో సోమవారం ఉదయం బాలింత చనిపోవడం చాలా బాధాకరమైన విషయం అని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.చంద్రప్ప , ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పెద్దోళ్ళ ఆనంద్ కుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్ లు మాట్లాడుతూ వైద్యుల యొక్క నిర్లక్ష్య కారణంగానే గత నెల నుండి స్థానిక మాత శిశు హాస్పిటల్ లో చనిపోవడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. దానితోపాటు సకాలంలో సరైనటువంటి వైద్యం అందక గర్భిణులు, బాలింతలు మృత్యువాత పడడం జరుగుతుందని నెల రోజుల్లోనే డెలివరీ కోసం వచ్చిన పేద కుటుంబాలకు చెందిన మహిళలు చనిపోవడం చాలా బాధాకరం అని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గర్భిణీ బాలింతల కోసం సరైన వైద్యం విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేయడం జరిగింది. డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్లు తమ సొంత హాస్పిటల్ పెట్టుకొని ప్రభుత్వ డాక్టర్లు ప్రైవేట్ హాస్పిటల్ నడిపిస్తూ ఉంటే అధికారులు చర్యలు తీసుకోకుండా ఏం చేస్తున్నారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేయడం జరిగింది.కావున ఇలాంటి డాక్టర్ల అందరి పైన చర్యలు తీసుకొని, డ్యూటీలో నిర్లక్ష్యం చేస్తూ గర్భిణీ ,బాలింతల మృతికి కారణమవుతున్న డాక్టర్లపై, సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వ ఉన్నత అధికారులు వెంటనే స్పందించి హాస్పిటల్ ని ఎప్పటికప్పుడు సందర్శించి కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలియజేయడం జరిగింది. త్వరలో ప్రభుత్వ హాస్పటల్ సమస్యల పైన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటేష్, పి డి ఎస్ యు డివిజన్ అధ్యక్షుడు నవీన్, వీరేశం, బాధిత కుటుంబా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వీధి కుక్కల దాడిలో 55 మేకలు మృత్యువాత

**తాండూరు, అక్టోబర్ 27(ప్రజా స్వరం) :**

కుక్కల దాడిలో 55 మేకలు మృత్యువాత పడిన సంఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం కంధనెల్లి గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకుంది. బాధితులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండల పరిధిలోని కందనెల్లి గ్రామానికి చెందిన ఒగ్గు సత్తయ్య మేకలు పెంపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. తనకున్న కొన్ని మేకలను తీసుకొని పొలానికి వెళ్ళాడు. ఇంటి దగ్గర ఉన్న కొన్ని మేక పిల్లలను తనకున్న దొడ్డిలో కట్టేశాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో కుక్కలు దొడ్డిలోకి ప్రవేశించి మేకలపై దాడి చేశాయి. ఈ దాడిలో 55 మేకలు మృత్యువాత చెందాయి.

# తుఫాన్ వార్తలపై సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంయమనం పాటించాలి

- థంబ్ నెయిల్లతో ప్రజలను తప్పదారి పట్టించొద్దు
- సంచలన హెడ్డింగ్‌లతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దు
- తుఫాన్ సహాయక చర్యలకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉంది
- విపత్కర సమయంలో తప్పడు ప్రచారాలకు, గందరగోళానికి ఆస్కారం ఇవ్వొద్దు
- -మొంథా తుఫాను నేపథ్యంలో హోం మంత్రి వంగలపూడి అనిత

**అమరావతి, అక్టోబర్ 27, ప్రజాస్వరం:**




మొంథా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఇలాంటి సమయంలో సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలకు ఆస్కారం ఇవ్వొద్దని హోం మంత్రి ఒక ప్రకటనలో కోరారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయని ఆమె తెలిపారు. రాష్ట్రంపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ హెచ్చరిక వచ్చినప్పట్నుంచి సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా అలెర్ట్ అయిందని... గత మూడు రోజుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోందని మంత్రి అనిత వివరించారు. సీఎం చంద్రబాబుతో పాటు ఐటీ మంత్రి నారా లోకేష్, తాను ఆర్టీజీ సెంటర్ నుంచి సమీక్షలు నిర్వహించి అన్ని విభాగాలను అలెర్ట్ చేశామని... యంత్రాంగాన్ని సిద్ధం చేశామని అనిత చెప్పారు.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్లు,ఎస్పీలు సహా వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేయడానికి అవసరమైన ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసిందని...జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించడంతో పాటు... తుఫాను సహాయక చర్యలకు అవసరమైన నిధులను విడుదల చేశారని వివరించారు. అలాగే కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం... మీడియా ద్వారా, సోషల్ మీడియా ద్వారా కూడా ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం చేరవేస్తోందని ఆ ప్రకటనలో హోం మంత్రి పేర్కొన్నారు.

**సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంయమనం పాటించాలి**

ఇలాంటి సమయంలో ప్రజలకు వేగంగా సమాచారాన్ని చేరవేసే సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలు తుఫాను వార్తల కవరేజ్ విషయంలో సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని అనిత అభిప్రాయపడ్డారు. అయితే ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ఫ్లాట్ ఫార్మ్‌లపై తుఫాను గురించి తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్లు ప్రభుత్వ పరిశీలనలో తేలిందని ఆమె చెప్పారు. ఈ క్రమంలో కొన్ని యూ ట్యూబ్ చానళ్లు, డిజిటిల్ మీడియా సంస్థలు పెట్టే థంబ్ నెయిల్స్ ప్రజలను భయపెట్టేలా ఉంటున్నాయని అన్నారు. సోషల్ మీడియా, డిజిటల్ మీడియాలో పెడుతోన్న కొన్ని థంబ్ నెయిల్స్ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా ఉన్నాయని... ఈ మేరకు ఆర్టీజీ సెంటర్ నుంచి తమకు సమాచారం వచ్చిందని అనిత తెలిపారు. సంచలనాల కోసం పెట్టే తప్పుడు హెడ్డింగ్ లు, థంబ్ నెయిల్స్ కారణంగా ప్రజల్లో తీవ్ర గందరగోళం నెలకొనే అవకాశం ఉందని ఆమె చెప్పారు. ఇది ప్రజల్లో అలజడికి కారణం అవుతుందని... ఈ నేపథ్యంలో తుఫాను విషయంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా కాకుండా.. వాస్తవాలకు అద్దం పట్టే విధంగా వార్తల కవరేజ్ చేయాలని ప్రభుత్వం సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలను అనిత కోరారు. సంచలనాల కోసం, వ్యూస్ కోసం ప్రజలను భయపెట్టేలా వ్యవహరించడం చట్ట విరుద్ధమన్నారు. అభూత కల్పనలు, అవాస్తవాలు, తప్పుదారి పట్టించేలా తుఫానుకు సంబంధించిన సమాచారం ప్రజల్లోకి వెళితే ఆ ప్రభావం ముంపు ప్రాంతాల ప్రజలు, వారి కుటుంబ సభ్యులుపై తీవ్రంగా ఉంటుందని... దీన్ని నివారించాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని వాస్తవాలకు అద్దం పట్టేలా తుఫాను వార్తల కవరేజ్ ఉండాలని ప్రభుత్వం ఆయా సంస్థలను హోం మంత్రి కోరారు. ప్రజలకు సమాచారం చేరవేడంలో అత్యంత కీలకమైన పత్రికలు, టీవీ ఛానెళ్లతో పాటు..... సోషల్ మీడియా, డిజిటల్ మీడియా మరింత జాగ్రత్తగా, బాధ్యతగా వార్తలు ప్రజలకు చేరవేయాలని హోం మంత్రి అనిత తెలిపారు.




# లాజిస్టిక్స్ అభివృద్ధికి రైలు రవాణా కారిడారే కీలకం

- నూతన పోర్టులకు రైల్వే కనెక్టివిటీ రావాలి
- రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- అమరావతి, గన్నవరంలలో నూతన రైల్వే కోచింగ్ టెర్మినళ్ల నిర్మాణానికి రైల్వే శాఖ ప్రతిపాదన

**అమరావతి, అక్టోబరు 27, ప్రజాస్వరం:**

రాష్ట్రంలోని నూతనంగా నిర్మించే పోర్టులను కూడా అనుసంధానించేలా రైల్వే కనెక్టివిటీ వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మూలపేట, విశాఖ, కాకినాడ, రామాయపట్నం తదితర పోర్టులకు కనెక్టివిటీని పెంచేలా లైన్లు వేయాలని సీఎం రైల్వే అధికారులకు సూచించారు. సోమవారం సచివాలయంలో రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసేలా ప్రణాళిక చేస్తున్నామని ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి ఉత్పత్తుల రవాణా కోసం రైల్వే సహకారం అవసరమని సీఎం అన్నారు. కేంద్రంతో కలిసి ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్ ను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. నడికుడిశ్రీకాళహస్తి, గుంటూరుగుంతకల్, గుణదలముస్తాబాద్ బైపాస్, రేణిగుంట, రాయదుర్గతుముకూరు మధ్య రైల్వేలైన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలో చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేపట్టిన రూ.33,630 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం అధికారులతో సమీక్షించారు. హైదరాబాద్బెంగుళూరు, అమరావతి మీదుగా హైదరాబాద్చెన్నై మార్గాల్లో హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్వే కారిడార్ కు సంబంధించిన ప్రతిపాదనలపై సీఎం చర్చించారు. అమరావతిలో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించేలా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు రావాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతిని కలుపుతూ చెన్నై బెంగుళూరు హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్ ఉండేలా చూడాలన్నారు. మరోవైపు ఖరగ్ పూర్ నుంచి చెన్నై వరకూ డెడికేటెడ్ రైలు రవాణా కారిడార్ పైనా సమీక్షలో సీఎం దిశానిర్దేశం చేశారు. కొత్తగా 1564 కిలోమీటర్ల కొత్త మార్గాలకు సంబంధించిన పనులపై కూడా సీఎం ఈ సమీక్షలో చర్చించారు. ఏపీని లాజిస్టిక్స్ కారిడార్ గా మార్చేలా ప్రణాళికలు చేస్తున్నామని ప్రస్తుతం ఉత్తరదక్షిణ భారత్ ల మధ్య కనెక్టివిటీ దిశగా పనులు జరిగాయని ఇక తూర్పు నుంచి పశ్చిమ రాష్ట్రాలను అనుసంధానించే ప్రాజెక్టులు కూడా చేపట్టాల్సి ఉందని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచనలు జారీ చేశారు. నడికుడి శ్రీకాళహస్తి మార్గంలో తదుపరి పనులు చేపట్టేందుకు అవసరమైన రూ.27 కోట్ల నిధుల్ని తక్షణం విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. కోటిపల్లి నర్సాపూర్ మార్గంలో కాకినాడ కోటిపల్లి అమలాపురం మార్గంలో రైలు సర్వీసు నడపాలని సూచించారు. అమరావతి, గన్నవరంలో నూతన రైల్వే కోచింగ్ టెర్మినళ్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని రైల్వే శాఖ చేసిన ప్రతిపాదనకు సీఎం అంగీకారం తెలిపారు. వీటితో పాటు విజయవాడ, గుంటూరు నగరాల్లోనూ రైల్వే కోచింగ్ టెర్మినళ్లను విస్తరిస్తున్నట్టు అధికారులు వివరించారు. గుంటూరు గుంతకల్ డబ్లింగ్ పనులు వేగంగా చేపట్టాలని... కాజీపేట విజయవాడ మధ్య మూడో లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.



**రాష్ట్రంలో ఐకానిక్ రైల్వే స్టేషన్లు**

రాష్ట్రంలోని విజయవాడ, విశాఖ, తిరుపతిలను ఐకానిక్ రైల్వే స్టేషన్లుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నూతనంగా నిర్మించనున్న అమరావతి రైల్వే స్టేషన్ ను కూడా వినూత్నంగా నిర్మాణం చేపట్టాలన్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ రీడెవలప్మెంట్ పనులు వేగంగా చేపట్టాలని తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికుల సౌలభ్యం కోసం స్కైవాక్ నిర్మించాలని సీఎం సూచించారు. విశాఖలో జ్ఞానాపురం వైపు అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటాయని సీఎం అన్నారు. ప్రస్తుతం మూడు స్టేషన్లతో పాటు నెల్లూరు, రాజమహేంద్రవరం స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్టు రైల్వే అధికారులు ముఖ్యమంత్రికి తెలియచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 73 స్టేషన్లను అమృత్ స్టేషన్ల కింద ఆధునీకరిస్తున్నామని రైల్వే అధికారులు వివరించారు. 373 చోట్ల రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి కూడా ప్రతిపాదించామని వెల్లడించారు. ఈ డిసెంబరు నాటికి రైల్వే స్టేషన్ల రూపు రేఖలు మారేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. కొత్తవలస కిరండోల్, కొత్తవలస విజయనగరం, దువ్వాడ, సింహాచలం మార్గాల్లో అభివృద్ధి పనులు, కొత్త మార్గాలకు సంబంధించిన సమస్యల్ని పరిష్కరించాలని సీఎం సూచించారు. విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కావాలని సీఎం పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల కంటే ముందే రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో ప్రతిపాదించిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. రూ.271 కోట్లతో స్టేషన్ అప్‌గ్రేడేషన్ పనులు చేస్తున్నట్టు రైల్వే అధికారులు వివరించారు. పుష్కరాల నాటికి వివిధ ప్రాంతాల నుంచి 1012 ప్రత్యేక రైళ్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని సీఎంకు తెలిపారు. ఈ సమీక్షకు రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పనా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ శ్రీవాస్తవ, తూర్పు కోస్తా రైల్వే జీఎం ఇతర రైల్వే అధికారులు హాజరయ్యారు.



## కాంగ్రెస్ హామీలు మాటలకే పరిమితం..

- **మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితఇంద్రారెడ్డి**

**చేవెళ్ల అక్టోబర్ 27(ప్రజాస్వరం):**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆమె నివాసంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లొళ్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అంతారం గ్రామానికి చెందిన ఆండాలుబాలన్నగౌడ్, పది మంది గ్రామస్తులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ... 22 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా పనిచేసి రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో అంతారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాకపురం రామస్వామి, బాకపురం యాదమ్మ, బేగరి శేఖర్, ఇటుకాల నర్సింలు, ఖానపురం జంగయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## మోకిలా, పిలిగుండ్ల పంచాయతీల్లో శుభ్రతా కార్యక్రమాల పై అధికారులు ప్రశంస

**శంకర్‌పల్లి అక్టోబర్ 27(ప్రజాస్వరం):**

మోకిలా మరియు పిలిగుండ్ల గ్రామ పంచాయతీలను మాజీ సిఈసి జె. ఎం. లింగ్డో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఎంపీడీవో వి.వెంకయ్య, అపో, పంచాయతీ కార్యదర్శులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. సందర్శనలో భాగంగా డంపింగ్ యార్డు, మోకిలా సెగ్రిగేషన్ షెడ్‌లను పరిశీలించి, తడి - పొడి చెత్త వేరు చేసే విధానాన్ని పరిశీలించారు.



పంచాయతీ స్థాయిలో చెత్త వేర్పు సక్రమంగా అమలవుతున్నందుకు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు పై తీసుకుంటున్న చర్యలను కూడా అభినందించారు.

## మద్యం దుకాణాలను లాటరి పద్ధతి ద్వారా పారదర్శకంగా కేటాయించడం జరిగింది

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 27(ప్రజాస్వరం):**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి 20252027 సంవత్సరాలకు రంగారెడ్డి జిల్లాలో మొత్తం 249 ఎ4 మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి లాటరి పద్ధతి ద్వారా పూర్తి పారదర్శకంగా కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం శంషాబాద్ లోని మల్లికా కన్వెన్షన్ హాల్ నందు సరూర్ నగర్ యూనిట్ 138 రిటైల్ మద్యం దుకాణాల, శంషాబాద్ యూనిట్ 111 రిటైల్ మద్యం దుకాణాల ఎంపిక కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సరూర్ నగర్ యూనిట్ 138 లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కేటాయించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ శంషాబాద్ యూనిట్ 111 లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పూర్తి పారదర్శకతతో మద్యం దుకాణాల లాటరీ నిర్వహించడం జరిగినదని, రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ యూనిట్ పరిధిలో మొత్తం 249



ఎ4 షాపులు ఉండగా, అందులో సరూర్ నగర్ ఎక్సైజ్ యూనిట్ 138 మద్యం దుకాణాలకు సంబంధించి 7,845, శంషాబాద్ ఎక్సైజ్ యూనిట్ 111 మద్యం దుకాణాలకు సంబంధించి 8,536 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లాలోని మద్యం షాపులను పారదర్శకంగా లాటరీ ద్వారా ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ అబ్కారీ మద్యనిషేధ శాఖాధికారి ఉజ్వల రెడ్డి, శంషాబాద్ అబ్కారీ మద్యనిషేధ శాఖాధికారి కృష్ణప్రియ పర్యవేక్షణలో మద్యం దుకాణాల ఎంపిక జరిగింది.

# 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...
# అన్ని రాష్ట్రాలకు నోటీసులు

- **'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ**
- **అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ**
- **మోసాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు సమర్పించాలని ఆదేశం**
- **ఇది దేశవ్యాప్త కుంభకోణం.. దర్యాప్తు సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు**
- **ఈ మోసాల వెనుక మయన్మార్, థాయ్‌లాండ్ ముఠాలు ఉన్నాయని వెల్లడి**

**నేషనల్ బ్యూరో సెప్టెంబర్ 27(ప్రజాస్వరం):**

దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమంటూ నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం, సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. ఈ తరహా మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. "దేశవ్యాప్తంగా ఒకేరీతిలో దర్యాప్తు జరిగేలా చూసేందుకు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తున్నాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని కోర్టుకు తెలిపారు. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ, ఈ మోసాల వెనుక ఉన్న మనీలాండరింగ్



ముఠాలు భారత్ బయట నుంచి, ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి పనిచేస్తున్నాయని వివరించారు. విచారణ సందర్భంగా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు వారం రోజుల సమయం కోరగా, ధర్మాసనం అనుమతించింది. ఈ క్రమంలో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో నమోదైన 'డిజిటల్ అరెస్ట్' సంబంధిత ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతానికి అధికారికంగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని, కేవలం కేసుల వివరాలను రికార్డుల రూపంలో అందించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నివేదికలు సమర్పించిన తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ జరగనుంది.

## మాదిగోని గుట్ట పై మైసమ్మ ఆలయాన్ని కూల్చివేయకూడదు

- **ఎన్కతలలో అడ్డుకున్న గ్రామస్తులు**
- **పోలీసుల రంగ ప్రవేశం**

**వికారాబాద్ జిల్లా అక్టోబర్ 27(ప్రజాస్వరం):**

అభివృద్ధి పేరుతో మైసమ్మ ఆలయాన్ని కూల్చివేస్తామనడం సరైనది కాదని మోమిన్ పేట్ మండలం, ఎన్కతల గ్రామానికి చెందిన రైతులు మండిపడ్డారు. టీజీఐఐసీ అధికారులు కూల్చివేతకు సిద్ధమవగా సోమవారం రైతులు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని 198 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో అనాదిగా మైసమ్మ గుడి ఉందన్నారు. ఇక్కడ కొలువైన మైసమ్మ తల్లిని తరాలుగా కొలుస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి భూమిని రైతులకు కేటాయించడంతో దశాబ్దాలుగా గ్రామ రైతులు సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల పారిశ్రామిక అభివృద్ధి కోసం ఈ భూమిని ప్రభుత్వం సేకరించి టీజీఐఐసీకి అప్పగించిందన్నారు. కాగా పరిశ్రమల అభివృద్ధి కోసం పనులు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా మైసమ్మ గుడిని తొలగించేందుకు ఐఐసి అధికారులు సిద్ధమయ్యారని అన్నారు. తరాలుగా తాము కొలుస్తున్న అమ్మవారి గుడిని తొలగించడం సరైనది కాదని ఐఐసీ అధికారులకు తెలిపారు. పనులు నిలిపివేయవలసిందిగా డిమాండ్ చేశారు. దీంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోమిన్ పేట్ ఎస్ఐ అరవింద్ నేతృత్వంలో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలతో చర్చించి సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కారం చేసుకోవాలని సూచించారు. అభివృద్ధిని గ్రామస్తులు అడ్డుకోకూడదని, ఇదే సమయంలో ప్రజల మనోభావాలను కూడా అధికారులు గౌరవించాలని ఎస్ఐ అరవింద్ అన్నారు.



## భవిష్యత తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచేలా సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి ఉత్సవాలు

- **రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ సహకారలతో, కేంద్ర ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో**
- **సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ వేడుకల నిర్వహణ**
- **దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలోను ఐక్యతా పాద యాత్రలు.**
- **జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా యువజన అధికారి ఐసయ్య**

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 27(ప్రజాస్వరం )**

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ వేడుకలు దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలోను ఐక్యతా పాద యాత్రలు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ వేడుకలలో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించే ఐక్యతా పాద యాత్రల పై సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా యువజన అధికారి ఐసయ్య తో కలిసి పాత్రికేయులతో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ సహకారలతో, కేంద్ర ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మేరా యువ భారత్, జాతీయ సేవ పథకం (NSS), National Cadet corps (NCC) శాఖల ద్వారా, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ వేడుకలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఘనంగా మునుపెన్నడు నిర్వహించని విధంగా యువతను భాగస్వామ్యం చేస్తు, భవిష్యత తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచేలా పలు కార్యక్రమలను నిర్వహించుటకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వార మన దేశ స్వాతంత్ర్యం, పునర్నిర్మాణంలో భాగస్వామ్యులైన త్యాగధనులను స్మరించుకుంటూ, యువతలో ఐక్యతా భావం మరింత బలోపేతం చెయ్యడం లక్ష్యంగా, గౌరవ భారత దేశ ప్రధాని నరేంద్ర మోడి గారి "వికసిత్ భారత్" ఆలోచనలకు అనుగునంగా రూపొందించబడిన ఈ కార్యక్రమం ద్వార భారత జాతి నిర్మాణంలో శ్రమించిన జాతీయ నాయకులకు ఘన నివాళి అర్పించనుంది. దేశవ్యాప్తంగా గల యువతీ యువకులు My Bharat.Gov.in websiteలో తమ వివరాలు నమోదు చేసుకొని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్, పార్లమెంట్ సభ్యులు, శాసన సభ సభ్యులు, జిల్లా మంత్రి అందరి భాగస్వామ్యంతో ప్రతి పార్లమెంట్ నియోజక వర్గంలో గౌరవ లోకసభ, పార్లమెంట్ సభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొని ఐక్యతా పాదయాత్ర నిర్వహించనున్నారని. ప్రతి పాదయాత్ర 8 నుంచి 10 కి.మీ సాగేలా ప్రణాళిక రూపొందించి అక్టోబర్ 31 నుంచి నవంబర్ 25 మధ్య నిర్వహించనున్నారు. రంగారెడ్డి జిల్లాలో రెండు విడుతలు పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇందులో జిల్లా కలెక్టర్, అధికారులు, క్రీడకారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల/కళాశాల విద్యార్థులు, పౌరులు పాల్గొంటారని తెలిపారు. Digital campaign అక్టోబర్ 10 నుంచి నవంబర్ 2 వరకు జాతీయ స్థాయిలో వ్యాసరచిన (250 పదాలు మించకుండ) లఘుచిత్ర పోటీలు (National Reads competitions) (20 నుంచి 30 సెకండ్లు మించకుండ మరియు క్విజ్ పోటీలను My Bharat.gov.in website ద్వార నిర్వహిస్తున్నారు. 01102025 నాటికి 15 సంవత్సరాలు పైబడి 29 సంవత్సరాలు లోపు వయస్సు గల యువతి యువకులు ఈ పోటీలలో పాల్గొనుటకు అర్హులని అన్నారు. నవంబర్ 3 నుంచి 20 మధ్య రాష్ట్ర స్థాయిలో ఎంపికలు చేసి, నవంబర్ 21 నుంచి 24 మధ్య అధికారికంగా ప్రకటిస్తారు. నవంబర్ 26న జాతీయ స్థాయి విజేతలను ప్రకటిస్తారు. ఈ పోటీల ద్వారా జాతీయ స్థాయిలో ఎంపికైన 150 మందికి కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడా మంత్రి గారితో కలిసి జాతీయ ఐక్యతా పాదయాత్రలో పాల్గొనే అవకాశం కల్పిస్తారని, ఈపోటీలలో పాల్గొన్న అందరికి ప్రశంసా పత్రం, అందిస్తారని తెలిపారు. ఈ ప్రెస్ మీట్ లో జిల్లా యువజన అధికారి ఐసయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సి.వెంకటేశం, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు మణిభూషన్ చౌదరి, ఎన్.మల్లారెడ్డి, నరేష్ యాదవ్, గూడూర్ అవినాష్ రెడ్డి, ఆర్.కె పురం సంతోష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయి మీద జరిగిన దాడిని ఖండిస్తూ

**మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27(ప్రజాస్వరం):**

సోమవారం రోజున పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలువ మేరకు చలో హైదరాబాద్ నవంబరు ఒకటో తేదీన దళితుల ఆత్మగౌరవ నిరసన మహా ప్రదర్శన విజయవంతం చేయడంకోసం మెదక్ టీఎన్జీవో భవనంలో ఎమ్మార్పీఎస్, మాల మాహానాడు, దళిత సంఘాల ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకుల మెదక్ జిల్లా సమీక్ష సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయి మీద జరిగిన దాడిని ఖండిస్తూ ఎం. ఆర్. పి. యస్, నాయకులు మెదక్ జిల్లా ఇన్చార్జి బొజ్జ సైదులు, మాలల హక్కుల వ్యవస్థాపకులు బొమ్మల మైసయ్య, మరియు అనుబంధ సంఘాలు నాయకులు మాట్లాడుతూ ఈ సందర్భంగా మెదక్ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులు హస్తరగల్ల బాలరాజ్, డీపీఎఫ్ జిల్లా కార్యదర్శి దయాసాగర్, మల్లేశం, పెంటయ్య, పోచయ్య, వీహెచ్పీఎస్ స్వరూప, మీడియా తో మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డా గావాయ్ పైన దాడి ని ఖండిస్తూన్నామని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బియర్ మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి కూడా శిక్షలు పడేలా స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని అందుకోసం సుప్రీంకోర్టు ప్రజాస్వామిక వాదులుగా గుర్తించబడ్డ సీనియర్ జడ్జిలతో విచారణ చేయించాలని, దళిత అనుబంధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దళితుడైన బిఆర్గవై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రావడం కొన్ని ఆధిపత్య శక్తుల జీర్ణం తినక పోతున్నాయని అందుకే అహంపూరితంగా ఈ దాడికి తెగబడ్డారని, కావున ఈ దాడికి పాల్పడ్డ వ్యక్తి మీద తక్షణమే కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని అలాగే దాడి వెనక ఉన్న శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా ఈ ఘటన మీద సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని వచ్చేనెల 1వ తేదీన దళితుల ఆత్మగౌర మహా నిరసన ప్రదర్శన సమావేశం సందర్భంగా చేపడుతున్నామని అన్నారు. అందుకోసం సుప్రీంకోర్టు అనుభవం కలిగిన



ప్రజాస్వామిక దృక్పథం కలిగిన విద్యార్థిలను దర్యాప్తు కోసం నియమించాలని అలాగే ఎలాంటి గడ్డలను ఉన్నత న్యాయవ్యవస్థలో పొనరావడం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని ఈ డిమాండ్లు తక్షణమే పరిగణ తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దళిత భాగస్వామ్య ఇతర సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇలాంటి సంఘటన మళ్లీ పునరావస్తం జరగకుండా తగు చర్యలు తీసుకునేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని అక్టోబర్ 7 న భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గావాయ్ బెంచ్ మీద లాయర్లు వాదనలు వెళ్తున్న సమయంలో రాకేష్ కిషోర్ అనే వ్యక్తి విసిరి దాడికి పాల్పడ్డారని చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడిని అన్నగరికమైందని ఈ దాడి ప్రజాస్వామిక స్ఫూర్తి రాజ్యాంగం మీద జరిగిన దాడిగానే ఉన్నదని ఈ దాడి సమస్త భారతీయులను దిగ్భ్రాంతికి గురి చేసిందని దళిత పీడత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదన గురి చేసిందని అందువల్ల దేశ దళిత ప్రజలందరూ ఈ దాడిని ఖండించాలని ముఖ్య అతిథి బొజ్జ సైదులు మెదక్ జిల్లా ఇన్చార్జి తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎమ్మార్పీఎస్ దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆనాటి సీన్ ఇప్పటికీ గుర్తుంది

బాహుబలి రెండు పార్టులను కలిపి ఒకే సినిమాగా తీసుకువస్తున్న క్రమంలో ఈ రీ రిలీజ్ సినిమాకు భారీ క్రేజ్ వస్తోంది. రెండు పార్టులను కలపడంతో పాటు కొన్ని కొత్త సీన్లను కూడా యాడ్ చేసినట్టు తెలుస్తోంది. ఇక మూవీని ప్రమోట్ చేయడానికి రాజమౌళి, ప్రభాస్, రానా రెడీ అయిపోయారు. ఈ ముగ్గురూ కలిసి తాజాగా ఓ ఇంటర్వ్యూలో సందడి చేశారు. బాహుబలి సమయంలోని చాలా విషయాలను పంచుకున్నారు. తాజాగా ఇందుకు సంబంధించిన ప్రోమోను రిలీజ్ చేశారు. ఇందులో ప్రభాస్ మాట్లాడుతూ.. పదేళ్లు అవుతోంది కదా.. మీకెలా అనిపిస్తోందని అడిగాడు. తనకు ఇప్పటికీ కొన్ని సీన్లు అలాగే మైండ్ లో ఉండిపోయాయని తెలిపాడు జక్కన్న. మరీ ముఖ్యంగా కట్టప్ప బాహుబలిని చంపడానికి కత్తి పట్టుకున్న టైమ్ లో ఇచ్చిన ఎక్స్ ప్రెషన్లు ఇప్పటికీ తన మైండ్ లో ఉండిపోయాయన్నాడు. అలాగే భళ్లాల దేవుడి విగ్రహాన్ని పైకి లేపే సమయంలో చేతులు వణికాయంటూ ప్రభాస్ గుర్తు చేసుకున్నాడు. ఇక ప్రభాస్ సభలో తల నరికే సీన్ గురించి కూడా మాట్లాడుకున్నారు. ఆ సీన్ మూడో రోజు ప్రభాస్ తల నరుకుతాడని రానా గుర్తు చేశాడు. అవును అది ఆ సీన్ లో చాలా బాగుంటుంది అన్నాడు రాజమౌళి. అవును అది మాట్లాడుకోవడానికి బాగుంది కానీ అంటూ ప్రభాస్ అన్నాడు. అంతకు మించి ప్రోమోలో చూపించలేదు. ముగ్గురూ ఇందులో సరదాగా మాట్లాడుకున్నారు. ఈ ఇంటర్వ్యూ బ్లాస్ట్ కావడం ఖాయం అంటున్నారు ఫ్యాన్స్. 'బాహుబలి: ది ఎపిక్' టైటిల్‌తో ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రభాస్, రానా స్పెషల్ ఇంటర్వ్యూలో సందడి చేశారు. షూటింగ్ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఓ కీలక సన్నివేశం గురించి రాజమౌళి ప్రస్తావించగా.. 'ఇప్పుడు బాగానే ఉంది. కానీ, అప్పుడు..' అంటూ ప్రభాస్ నవ్వులు పూయించారు. తాజాగా ప్రోమో విడుదలైంది. పూర్తి వీడియో త్వరలోనే రిలీజ్ కానుంది.



## మన శంకర్ వరప్రసాద్ గారు హాట్ కేకులా బిజినెస్ పార్ట్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం 'మన శంకర్ వరప్రసాద్ గారు' అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాని అత్యంత ప్రతిష్టాత్మకంగా మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుష్మితతో పాటు సాహు గారపాటి కూడా నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా రిలీజ్ ప్లాన్ చేయబడిన ఈ సినిమా అనౌన్స్ చేసిన నాటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. దానికి కారణం అనిల్ రావిపూడి కామెడీ టైమింగ్ అనే చెప్పాలి. ఎందుకంటే, గతంలో ఆయన చేసిన అన్ని సినిమాలు కామెడీ టైమింగ్‌తోనే వర్కౌట్ అయ్యాయి. దానికి తోడు, చివరిగా ఆయన చేసిన విక్టరీ వెంకటేష్ సినిమా, సంక్రాంతికి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఏకంగా 300 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. ఈ నేపథ్యంలో, మెగాస్టార్ టైమింగ్‌తో పాటు అనిల్ రావిపూడి కామెడీ టైమింగ్ కూడా సింక్ అయితే, ఈ సినిమాని ఆపేవారే లేరని ప్రచారం. ఈ నేపథ్యంలో సినిమా బిజినెస్ కూడా హాట్ కేకులా పూర్తయినట్లుగా సమాచారం. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ సినిమా నాన్ థియేట్రికల్ రైట్స్ తోనే సినిమా బడ్జెట్ అంతా కవర్ అయిపోయినట్లుగా తెలుస్తోంది. ఈ మధ్యకాలంలో సినిమాల నాన్ థియేటర్ బిజినెస్ గాలిలో దీపంలా మారిపోతున్న తరుణంలో, ఏకంగా షూటింగ్ దశలో ఉండగానే నాన్ థియేట్రికల్ పూర్తి చేసుకోవడం అనేది ఒక ఆసక్తికరమైన పరిణామం అనే చెప్పాలి. ఈ సినిమా డిజిటల్ రైట్స్ జీ సంస్థ దక్కించుకున్నట్లుగా సమాచారం. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రంగం సిద్ధమవుతోంది.

## బాబీ కొల్లి చిరు కాంబినేషన్‌లో మెగా 158

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆయన లైన్‌లో ఉన్న అత్యంత ఆసక్తికర చిత్రాల్లో ఒకటి దర్శకుడు బాబీ కొల్లి (కె.ఎస్. రవీంద్ర) దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం. చిరు జన్మదినం సందర్భంగా ఈ సినిమాను ప్రకటించడంతో మెగా ఫ్యాన్స్‌లో భారీ ఎక్సైట్‌మెంట్ నెలకొంది. 'వాల్తేరు వీరయ్య' విజయానంతరం బాబీ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం మరో సూపర్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో ఉంది. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ 'బ్లడీ బెంచ్‌మార్క్ సెట్ చేసిన బ్లేడ్' అనే ట్యాగ్‌లైన్‌తో మెగా మాస్ హిస్టీరియాను పెంచింది. రక్తంతో తడిసిన చిలుక ఆకారం, గొడ్డలి డిజైన్ చూసి ఇది రస్టిక్ మాస్ యాక్షన్ డ్రామా అని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇక ఈ సినిమాలో చిరంజీవితో పాటు మరో స్టార్ హీరో కూడా కీలక పాత్రలో నటించబోతున్నారని సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం, కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ ఈ సినిమాలో భాగమవుతున్నాడని తమిళ వర్గాలు పేర్కొన్నాయి. ఇది కేవలం గెస్ట్ రోల్ కాదు, ఫుల్ లెంగ్త్ పవర్‌ఫుల్ క్యారెక్టర్ అని టాక్. చిరు కార్తీ స్క్రీన్ షేర్ చేస్తారన్న ఈ వార్త మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రస్తుతం ఈ మూవీ ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. మలయాళ బ్యూటీ మాళవికా మోహనన్ హీరోయిన్‌గా నటిస్తారని వార్తలు వస్తున్నాయి. ఇక బాలీవుడ్ యాక్టర్‌డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారని టాక్.సంగీతాన్ని ఎస్. థమన్ అందించనున్నారు. ఇటీవలే ఆయన ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని ధృవీకరించారు. 'మెగా 158' చిత్రాన్ని 2027 సంక్రాంతికి విడుదల చేసేలా షూటింగ్ షెడ్యూల్‌ను ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.త్వరలోనే ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు, నటీనటుల జాబితా అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.



## గర్ల్‌ఫ్రెండ్‌లో గెస్ట్ రోల్‌ను తిరస్కరించిన వంగా

నేషనల్ క్రష్ రశ్మికా మందన నటించిన హిందీ మూవీ 'థామా'వంద కోట్ల క్లబ్ లో చేరింది. మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ బ్యానర్ నుండి ఇటీవల కాలంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రాల సరసన ఇది చేరకపోయినా... రశ్మిక అభిమానులు మాత్రం ఆమె పోషించిన బేతాళురాలి పాత్ర కొత్తగా ఉందని ఆనందిస్తున్నారు. ఇదిలా ఉంటే... రశ్మిక నటించిన మరో చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' నవంబర్ 7న పాన్ ఇండియా స్థాయిలో జనం ముందుకు రాబోతోంది. దీన్ని అల్లు అరవింద్ సమర్పణలో నిర్మించారు. నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఓ కీలక పాత్రను చేయమని ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగను అడిగారట. ఈ విషయం గురించి దర్శకుడు రాహుల్ ఇటీవల మాట్లాడుతూ, 'ఈ సినిమాలో అతిథి పాత్రను మించిన ఓ కీలకమైన పాత్ర ఒకటి ఉంది. అది సందీప్ రెడ్డి వంగ చేస్తే కొత్తగా ఉంటుందనిపించింది. ఆయనలో మంచి నటుడు కూడా ఉన్నాడని నా నమ్మకం. అదే ధైర్యంతో ఆయన్ని అప్రోచ్ అయ్యాను. అయితే సందీప్ ఈ ఆఫర్ ను సున్నితంగా తిరస్కరించాడట. అతిథి పాత్రలో సరదాగా ఒకటి రెండు సీన్స్ అంటే ఓకే కానీ... నాలుగైదు సీన్స్ చేయడం కష్టమే' అని చెప్పేశాడట. దాంతో రాహుల్ రవీంద్రన్ ఆ పాత్ర చేయమని ప్రముఖ నటుడు 'వెన్నెల' కిశోర్ ను కోరాడట. ఎందుకంటే... 'వెన్నెల' కిశోర్, రాహుల్ రవీంద్రన్ మధ్య మంచి స్నేహం ఉంది. మాములూ గా అయితే రాహుల్ రవీంద్రన్ మాటను 'వెన్నెల' కిశోర్ ఎప్పుడూ కాదని చెప్పడు. కానీ ఆ పాత్రకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని, కమెడియన్ ఇమేజ్ ఉన్న తాను అలాంటి సీరియస్ పాత్ర చేస్తే జనం యాక్సెప్ట్ చేయరని కిశోర్ స్పష్టం చేశాడట. దాంతో ఇక గత్యంతరం లేక తానే ఆ పాత్రను చేశానని రాహుల్ తెలిపాడు. ఇటీవల వచ్చిన 'ది గర్ల్ ఫ్రెండ్' ట్రైలర్ లో రాహుల్ రవీంద్రన్ కనిపించాడు. నిజానికి తాను మల్టిపుల్ టాస్క్స్ చేయలేనని, అందుకే దర్శకత్వం, నటన ఒకేసారి చేయడం ఇష్టముండేది కాదని రాహుల్ రవీంద్రన్ తెలిపాడు. తాను గతంలో దర్శకత్వం వహించిన 'చి.లా.సౌ.', 'మన్మధుడు 2' చిత్రాలలో అందుకే నటించలేదని తెలిపాడు. కానీ ఈ సినిమాలో మాత్రం ఆ పాత్ర చేయకతప్పలేదని అన్నాడు. నిజానికి రాహుల్ ఫస్ట్ ఛాయిస్ అయిన సందీప్ రెడ్డి వంగా ఈ పాత్రను చేసి ఉంటే... సినిమాకు ఖచ్చితంగా ప్లస్ అయ్యి ఉండేది. ఎందుకంటే... 'పుష్ప' సినిమా తర్వాత హిందీలో రష్మికా మందణ్ణకు మళ్ళీ ఆ రేంజ్ హిట్ ఇచ్చిన సినిమా 'యానిమల్'. దాని దర్శకుడు సందీప్ రెడ్డి వంగ, రశ్మిక స్క్రీన్ షేర్ చేసుకుని ఉంటే... ఖచ్చితంగా అది ఉత్తరాది ఆడియెన్స్ లోనూ క్యూరియాసిటీ క్రియేట్ చేసి ఉండేది.







## బాహుబలిలో కొత్త సన్నివేశాలు యాడ్

భారతీయ సినీ చరిత్రలో సరికొత్త రికార్డులు సృష్టించిన 'బాహుబలి' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒకే మూవీగా 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ సినిమా షూటింగ్ జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ.. పలు ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. బాహుబలి' రెండు భాగాల్లోని కొన్ని సన్నివేశాలను కట్ చేసి 'బాహుబలి: ది ఎపిక్'ను తీసుకొస్తున్నాం. ఎమోషన్ మిస్ కాకుండా ఉండేందుకు ఒక కొత్త సన్నివేశం యాడ్ చేశాం. కొత్తగా చిత్రీకరించిన సీన్ కాదు. అప్పుడు ఎడిటింగ్‌లో తీసేసిన సీన్ ఇప్పుడు ఉపయోగపడుతోంది. నేటి ట్రెండ్‌కు తగ్గట్టు కలర్ గ్రేడింగ్ మార్చాం అని అన్నారు. రాజమౌళి 'ఈగ' సినిమా తర్వాత బాహుబలి ఆలోచన చెప్పారు. ఇది విజువల్ వండర్ అని అప్పుడే నాకు అర్థమైంది. ఎలాంటి విజువల్స్ ఉంటే బాగుంటుందన్న కోణంలో కొంత రీసెర్చ్ చేశా. నిర్మాత శోభు యార్లగడ్డ, రాజమౌళిని ఒప్పించి మరీ ఈ సినిమాని డిజిటల్ కెమెరాలో షూట్ చేశా. ఈ సినిమా విషయంలో నేను తీసుకున్న కీలక నిర్ణయమదే. చాలా పెద్ద ప్రాజెక్టు కావడం, ఆ టెక్నాలజీ కొత్త కావడంతో వర్కౌట్ అవుతుందో లేదోనని వాళ్లు కాస్త టెన్షన్ పడ్డారు. రాజద్రోహి పారిపోతుంటే.. ప్రభాస్, రానా పట్టుకునే సీన్‌ను తొలుత ఓ ప్రాంతంలో షూట్ చేశాం. తర్వాత షాట్ తీస్తుండగా.. చుట్టూ వేలమంది ప్రజలు కనిపించారు. కెమెరాను ఎక్కడ పెట్టినా అందులో వాళ్లే కనిపించేవారు. అంతమంది జనంలో మేం షూటింగ్ చేయలేక ఆ షెడ్యూల్ ఆపేశాం. మరుసటి రోజూ అదే పరిస్థితి. అందుకే ఈ సినిమాని బయట షూట్ చేయకుండా రామోజీ ఫిల్మ్ సిటీలో చేశాబని తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999